

వాకింగ్ ట్రాక్ ప్రవేశ ద్వారా ఇలా..



విషపురుగులకు నిలయంగా వాకింగ్ ట్రాక్ వెంట తుప్పలు



చిట్టివలస లే అవుట్ వైపు గేటు వద్ద తుప్పలు



నిర్వహణ లేక శిథిలమైన ట్రాక్

నిధులు 'చెరువు'పాలు

- చిట్టివలస చెరువు సుందరీకరణ పనులపై నిర్లక్ష్యం
- 2018 నుంచి తూతూమంత్రంగా పనులు
- ట్యాంక్‌బండ్ తరహాలో అభివృద్ధి అంటూ నాటి మంత్రి గంటా హామీ
- ఒక్క అడుగు ముందుకు.. నాలుగు అడుగులు వెనక్కి అన్నట్టు సాగుతున్న పనులు
- ఆహ్లాదానికి దూరమవుతున్న చిట్టివలసవాసులు



చెరువు గట్టుకు బండరాళ్ల పేర్చకపోవడంతో మొలిచిన తుప్పలు

తగరపువలస: చిట్టివలస చెరువు సుందరీకరణ అభివృద్ధి పనులు ఒక్క అడుగు ముందుకు నాలుగు అడుగుల వెనక్కి అన్నట్టుగా సాగుతున్నాయి. రూ.కోట్ల నిధులన్నీ చెరువులో పోస్తున్నా.. స్థానికులకు ఏ మాత్రం ఉపయోగపడటం లేదు. చెరువు దుర్గంధం సమస్యను ఏ మార్చడానికే తరచూ సుందరీకరణ పనులను తెరపైకి తీసుకువస్తున్నారు. 2014–19 టీడీపీ ప్రభుత్వ హయాంలో చెరువు పెరికివీధి వైపు దుర్గంధం కారణంగా ఆందోళనలు మొదలయ్యాయి. సమస్యను అర్థం చేసుకోలేని అప్పటి మంత్రి గంటా శ్రీనివాసరావు దశాబ్దాల తరబడి చెరువులోకి వస్తున్న తగరపువలస డ్రైనేజీ మురుగును పవిత్రమైన గోస్తనీనదికి మళ్లించి కలుషితం చేశారు. 2018లో సంప్రదాయ మత్స్యకారుల పొట్టకొట్టి బలవంతంగా చెరువును ఖాళీ చేయించి ఆరుమాసాలలో సుందరీకరణ పనులు పూర్తవుతాయన్నారు. ట్యాంక్‌బండ్ తరహాలో నాలుగు వైపులా వాకింగ్ ట్రాక్, గట్టుపై పార్కు, సిమెంట్ బెంచీలు, పచ్చని చెట్లు, చుట్టూ లైటింగ్, చెరువులో బోటుషికారు అబ్బో అరచేతితో స్వర్గం చూపించారు. రూ.1.98 కోట్లతో చుట్టూ గట్టును అభివృద్ధి చేయడానికి వేసిన శిలాఫకం నాయకులు, అధికారుల నిర్లక్ష్యం భరించలేక చెరువులో కూలిపోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రూ.6.50 కోట్లతో చెరువు సుందరీకరణ పనులకు 2023లో అప్పటి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ముందడుగు వేశారు. చెరువులో ఆక్రమణలు, వాటి సర్వే, ప్రమాదకరమైన మురుగు, సంగివలస ఎన్ఆర్ఐ ఆస్పత్రి నుంచి వ్యర్థాల మళ్లింపు వంటి వివాదాలతో అధికారులు రెండేళ్లు కాలం గడిపేశారు.

ఆహ్లాదకరమైన వాతావరణం కోసం ఎదురుచూపు

తగరపువలస, చిట్టివలస ప్రజలు ఆహ్లాదకరమైన వాతావరణం కలిగిన పార్కు, వాకింగ్ ట్రాక్ కోసం ఎదురు చూసి ముఖం వాచిపోయింది. గత ఎన్నికల కోడ్‌తో నిలిచిపోయిన చెరువు సుందరీకరణ పనులు తరువాత మందకొడిగా సాగాయి. చెరువుకు రెండు వైపులా ఫెన్సింగ్, సైడ్ పలకలు వేసి కాంట్రాక్టర్ ఊరుకున్నాడు. ముఖద్వారం, గేటు అరకొరగా పెట్టి వదిలేశారు. పార్కుకు వచ్చేవారికి బెంచీలు కూడా లేవు. పార్కుకు ఎవరూ రావడం లేదు. దీంతో పార్కుతో పాటు చుట్టూ పరిసరాలు అడవిలా మారిపోయింది. గట్లపై విషపురుగులు తిష్టవేస్తున్నాయి. చీకటిపడితే గట్లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయాయి. వర్షాలకు గట్లు జారిపోకుండా బండరాళ్లు పేర్చి పూర్తి వసతులతో సుందరీకరణ పనులు పూర్తి చేయాలని 1,2 వార్డుల ప్రజలు కోరుతున్నారు. దుర్గంధానికి కారణమైన చెరువు అవుట్ ఫ్లో, ఇన్ ఫ్లోలను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

ఎక్కడికో వెళ్తున్నాం



వాకింగ్ ట్రాక్, పార్కులు లేక పిల్లలను తీసుకుని భీమిలి వంటి దూరప్రాంతాలకు వెళ్తున్నాం. కనీస వసతులతో చిట్టివలస చెరువు పార్కును అభివృద్ధి చేస్తే బాగుంటుంది.

– ఏలూరు రాంబాబు, సంతపేట

సంగివలస పార్కు శిథిలం



దివీస్ రూ.2.25 కోట్లతో నిర్మించిన సంగివలస పార్కులో జీవీఎంసీ నిర్వహణ లేకపోవడంతో అయిదేళ్లకే పనికి రాకుండా పోయింది. దానికి బదులు చిట్టివలస చెరువు సుందరీకరణ పనులు చేసి అభివృద్ధి చేస్తే బాగుంటుంది.

– తమ్మిన శ్రీను, తగరపువలస

అందుబాటులోకి తీసుకురావాలి



తీరిక సమయంలో పిల్లలు, పెద్దలు సేద తీరడానికి ఈ ప్రాంతంలో అనువైన ప్రదేశాలు లేవు. జీవీఎంసీలో ఉన్నామని పేరుకే గాని చెప్పుకోవడానికి ఏమీ లేదు. చెరువు సుందరీకరణ చేసి అందుబాటులోకి తీసుకు రావాలి.

– పాశల శివ, చిట్టివలస

ఇదేం బాదుడు 'బాబూ'..

ప్రభుత్వానికి సీపీఐ జిల్లా కార్యదర్శి పైడిరాజు ప్రశ్న



చంద్రంపాలెంలో అధిక ధరలపై నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

మధురవాడ: ఒక వైపు ప్రజలకు దీపావళి నుంచి ఉచితంగా గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పి మరోవైపు ప్రజలపై మోయలేని విద్యుత్ చార్జీలు భారాన్ని మోపేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు ఆందోళన వ్యక్తం చేశారు. అధిక ధరలకు నిరసనగా ఆదివారం జీవీఎంసీ 7వ వార్డు చంద్రంపాలెం, దుర్గానగర్‌లలో నిర్వహించిన ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన 4 నెలలకే హామీలు విస్మరించి వివిధ రకాల నిత్యావసర వస్తువుల ధరలు పెంచి సామాన్యులపై భారం మోపిందన్నారు. ఇది చాలదన్నట్టు ఎప్పుడో వాడిన విద్యుత్‌కు టారిఫ్ పెంచి ఇప్పుడు వసూలు చేయాలని చూడడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.మన్మథరావు, ఏరియా కార్యదర్శి సత్యనారాయణ, వీవీ అప్పారావు, ఎస్.రాము, కె.చిన్న, పి.రమణ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా దుష్పరిణామాలపై 30న చైతన్య శిబిరం

మద్దిలపాలెం: బాణసంచా కాల్చడం ద్వారా సంభవించే దుష్పరిణామాలపై సుప్రీం కోర్ట్ సూచనలకు అనుగుణంగా యువతలో చైతన్యం తీసుకొచ్చేందుకు ఈ నెల 30న బాల వికాస్ ఫౌండషన్ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధి ప్రకాశరావు తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు ఎంవీపీ కాలనీలోని ఎ.ఎస్.వి.వి.పి. డిగ్రీ కళాశాల సెమినార్ హాల్‌లో చైతన్య శిబిరం జరగనుందన్నారు.

క్లుప్తంగా

పవిత్రోత్సవాలకు అంకురార్పణ



కుంతీ మాధవ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న పూజలు

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో నాలుగు రోజులు నిర్వహించనున్న అనంతుని పవిత్రోత్సవాలకు ఆదివారం రాత్రి అంకురార్పణ జరిగింది. ముందుగా కుంతీ మాధవ స్వామి ఆలయంలో విషేష పూజలు నిర్వహించారు. విశ్వక్షేన పూజ, పుణ్యావచనం, రక్షా బంధనం వంటి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పాత సంత నిర్వహించే ప్రాంతం వద్ద మేదిని దేవికి పూజలు నిర్వహించారు. ఇక్కడ నుంచి పుట్ట బంగారాన్ని కుంతీ మాధవ స్వామి ఆలయంలోకి తీసుకువెళ్లారు.

నేటి నుంచి మద్దిలో బంగారమ్మ ఉత్సవాలు

పద్మనాభం: మండలంలోని మద్దిలో సోమవారం నుంచి తొలేళ్లతో బంగారమ్మ ఉత్సవాలు ప్రారంభమవుతాయి. దీనిలో భాగంగా సోమవారం అమ్మవారి ప్రతిమలను గ్రామంలో ఊరేగిస్తారు. మంగళవారం అమ్మవారి అనుపోత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఈ రెండు రోజులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామని నిర్వాహకులు తెలిపారు. అమ్మవారి ఆలయ పరిసర ప్రాంతాలను విద్యుదీపాలతో అలంకరించారు.

రూ.10 వేలు సాయం



మోహన్‌రావుకు రూ.పదివేలు అందిస్తున్న శ్రీరామచంద్రమూర్తి

భీమునిపట్నం: కలిగొట్ల స్విగ్రశ్రీదేవి ఫౌండేష్ ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు సంస్థ చైర్మన్ శ్రీరామచంద్రమూర్తి ఆర్థిక సాయం అందజేశారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న స్కాలర్‌షిప్ పరీక్షల్లో పాల్గొనడానికి ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ఉచితంగా విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నారు. విద్యార్థులకు అవసమైన స్టడీ మెటీరియల్ కోసం సొసైటీ వ్యవస్థాపకుడు గంట మోహనరావుకు రూ.పదివేలు అందించారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

మధురవాడ: ప్రజా సమస్యలు పరిష్కారానికి తాను నిత్యం కృషి చేస్తానని జనసేన భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పంచకర్ల సందీప్ అన్నారు. ఆదివారం జీవీఎంసీ 6వ వార్డు మధురవాడ సాయిప్రియ గార్డెన్ రోడ్డులో మహిళా నాయకురాలు ప్రమీళారాణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జనసేన జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఉనికి కాపాడు కోవడానికి, పార్టీని బలోపేతం చేయడం కోసం జెండాలు ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

అయ్యప్పస్వామి పీఠం ప్రారంభం



శింగనబందలో అయ్యప్పస్వామి పీఠాన్ని ప్రారంభిస్తున్న అర్చకుడు రవిగణేష్

తగరపువలస: భీమిలి మండలం శింగనబందలో కాళ్ల సన్యాసినాయుడు సొంత ఖర్చులతో నిర్మించిన అయ్యప్పస్వామి పీఠాన్ని ఆదివారం చిట్టివలస జ్యూట్‌మిల్లు రామాలయం అర్చకుడు, గురుస్వామి ఆకెళ్ల రవిగణేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు గాడు శ్రీను, సర్పంచ్ గాడు వెంకటనారాయణ, జెడ్పీటీసీ సభ్యు డు వెంకటప్పడు, కరుభుక్త అప్పలనారాయణ, కరుభుక్త వెంకటరమణ, గుడ్డాల ఎల్లయ్య, కాళ్ల అప్పలరాజు, గాడు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

పార్కు స్థలంలో దర్జాగా ఇంటి నిర్మాణం



బొడ్డపాలెం సర్వే నంబర్ 278/1 పార్కు స్థలంలో నిర్మిస్తున్న ఇల్లు

తగరపువలస: ఆనందపురం మండలం వెల్లంకి పంచాయతీ బొడ్డపాలెం సర్వే నంబర్ 278/1లో పార్కు కోసం కేటాయించిన స్థలంలో టీడీపీ నాయకులు కబ్జా చేసిన ఇల్లు నిర్మిస్తున్నారు. 2002లో అప్పటి పాలకవర్గం పార్కు కోసం సుమారు 250 గజాల స్థలాన్ని కేటాయించింది. పంచాయతీ పాలక వర్గానికి చెందిన ముగ్గురు అధికారం అడ్డుపెట్టకుని దర్జాగా నిర్మాణం చేపడుతున్నారు. దీనిపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేయగా భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పీఏ సత్య తమకు అనుమతి ఇచ్చారని కబ్జాదారుడు బెదిరింపులకు దిగినట్టు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం తమ వెంట ఉందని తమను ఎవరూ ఏమీ చేయలేరని దూకుడుగా వ్యవహరిస్తుండడంతో ఇక్కడివారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో స్థానికులు కొత్తగా వచ్చిన వీఆర్వో లక్ష్మణరావు ముందు ఈ ఆక్రమణ సమస్యను ఉంచారు. అయినప్పటికీ పార్కు స్థలంలో ఇంటి నిర్మాణం ఆపకపోవడంతో స్థానికులు సోమవారం ఆనందపురం తహసీల్దార్ కార్యాలయంలో జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేయనున్నారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపనలు చేశారు.

కొనసాగుతున్న కార్తీక దామోదర మాసోత్సవాలు

కార్తీక దామోదర మాస ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా వేకువజామున 4.30 గంటల నుండి 6 గంటల వరకు ప్రత్యేక కార్యక్రమాలు, మంగళహారతి, నర్సింహ హారతి, తులసి హారతి, భగవంతునికి నేతి దీప సమర్పణ, గజేంద్ర స్తుతి, దామోదరాష్టకం, గోపి గీత, భగవద్గీత, శిక్షాష్టకం, యుగలాష్టకం పారాయణం నిర్వహించినట్లు ఇస్కాన్ అధ్యక్షుడు సాంబాదాస్ ప్రభూజీ తెలిపారు.

'ఎన్ఎంఎంఎస్' ఉచిత మెటీరియల్ పంపిణీ



విద్యార్థులతో వింగ్స్ ఫౌండేషన్ ప్రతినిధులు

తగరపువలస : ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో చిట్టివలస జెడ్పీహైస్కూల్‌లో శిక్షణ పొందుతున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) విద్యార్థులకు ఆదివారం వింగ్స్ ఫౌండేషన్ ఉచిత మెటీరియల్ పంపిణీ చేసింది. ఫౌండేషన్ అధ్యక్షుడు ఆనంద్ చేతులమీదుగా వంద మంది విద్యార్థులకు ఈ మెటీరియల్ అందిస్తూ ఈ పరీక్షలో అర్హత పొందిన ప్రతి ఒక్కరికి రూ.2వేలు ప్రోత్సాహక బహుమతి అందిస్తానని హామీ ఇచ్చారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కష్టానికి తగు ఫలితాలు తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా నగరానికి చెందిన డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాల సూపరెండెంట్ జీవీ అప్పారావు విద్యార్థులకు అల్పాహారం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ పర్సన్ దొరబాబు, మాదాబత్తుల సూర్యారావు, ఆర్.భరత్, సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు గంటాన మోహనరావు, ప్రధానకార్యదర్శి రేఖ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్ మార్కెట్లో ఇసుక విక్రయాలు



వేములవలస వేయింగ్ బ్రిడ్జ్ సమీపంలో రోడ్డుపై అడ్డదిడ్డంగా ఇసుక లారీలు

తగరపువలస: కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానం పక్కదారి పడుతోంది. రీచ్‌ల వద్ద సామాన్యులకు ఇసుక అందుబాటులోకి రావడం లేదు. దీంతో నల్లబజారులో టన్ను రూ.800 వంతున కొనుగోలు చేస్తున్నారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన కూటమి ఎమ్మెల్యేలు ఆముదాలవలస నియోజకవర్గంలోని బూర్జ నుంచి ఇసుకను అనధికారంగా లారీ లోడ్ చేసుకోవడానికి రూ.15వేలు వంతున వసూలు చేస్తున్నారు. దీంతో పొట్టకూటి కోసం నగరానికి చెందిన లారీ యజమానులు ఆ డబ్బులు చెల్లించి 30 టన్నుల వరకు లోడ్ చేసుకుని తెచ్చుకుంటున్నారు. ఆనందపురం మండలంలోని వేములవలస, తాళ్లవలస నుంచి వెల్లంకి సర్వీస్‌రోడ్డు, చెరకుపల్లి అవంతి కళాశాల నుంచి అన్నవరం వెళ్లే దివీస్ రోడ్డు, రాజాపులోవ శివారులో ఇసుక లారీలను నిలిపి చిల్లర విక్రయాలు నిర్వహిస్తున్నారు. నాలుగు యూనిట్ల ట్రాక్టర్ ఇసుక రూ.3,200 నుంచి విక్రయిస్తున్నారు. దీంతో అత్యవసర పనులు ఉన్నవారు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. ఆదివారం ఆనందపురం మండలం వేములవలస కూడలి నుంచి వేయింగ్ బ్రిడ్జ్ వరకు వందల సంఖ్యలో లారీలతో ఇసుకను తీసుకువచ్చి రహదారి పక్కన ఉంచారు. దీంతో ఈ మార్గంలో ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ప్రభుత్వం అమలు చేస్తున్న లోపభూయిష్టమైన ఇసుక విధానమే నల్ల బజారులో విక్రయాలకు కారణమవుతుందని ఇంటి నిర్మాణ యజమానులు వాపోతున్నారు.

ఉత్సాహంగా లడ్డూ మేకింగ్



లడ్డూ తయారీ పోటీల్లో పాల్గొన్న మహిళలు

ఏయూక్యాంపస్: పండగ అనగానే ఠక్కున గుర్తొచ్చేవి లడ్డూలు. ఈ సంప్రదాయాన్ని గుర్తుచేసేలా బీచ్ రోడ్డులోని నోవాటెల్‌లో ఆదివారం లడ్డూ మేకింగ్ వేడుక నిర్వహించారు. దీనికి శ్రావ్యమైన వీణా కచేరీ, చక్కని సంగీతం తోడవగా.. ఎదురుగా సాగర తీరాన్ని తిలకిస్తూ ఈ కార్యక్రమంలో నగరవాసులు, హోటల్‌కు విచ్చేసిన అతిథులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టేబుళ్లపై తమకు ఇచ్చిన బూందీని లడ్డూగా తయారు చేసి సందడి చేశారు. మహిళలను ఆకట్టుకునే రంగోలీ, అలంకరణ వస్తువులు, నోరూరించే ఆహార పదార్థాలను ఇక్కడ ఏర్పాటు చేశారు.

పేరుకుపోతున్న వ్యర్థాలు



చిప్పాడలో వ్యర్థాల పోగు



రక్షిత మంచినీటి పథకం వద్ద వ్యర్థాలు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ పంచాయతీలో సేకరించిన వ్యర్థాలను గ్రామ శివారులో డంపింగ్ చేస్తున్నారు. డంపింగ్ యార్డులకు తరలించాల్సి ఉన్న సిబ్బంది కొరత కారణంగా వ్యర్థాలను తిరిగి గ్రామానికి ఆనుకుని ఉన్న ప్రదేశంలో రోజుల తరబడి ఉంచుతున్నారు. దీంతో ఈ వ్యర్థాలు గాలికి వీచినప్పుడల్లా చెల్లాచెదురై గ్రామంలోకే వస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఈ ప్రదేశంలోనే దివీస్ లేబరేటరీ ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి పథం కూడా ఉంది. దీని వెనుక, ముందు చెత్తతో అపారిశుద్ధ్య పరిస్థితులు నెలకొని ఉన్నందున గ్రామస్తులెవరూ తాగునీటి కోసం రావడం లేదు. నిల్వ చేస్తున్న వ్యర్థాలను దూరంగా తరలించాలని పంచాయతీ సిబ్బందితో పాటు సచివాలయంలో స్థానికులు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. వెంటనే వ్యర్థాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు మధ్యలో కంచె..తరచూ ప్రమాదాలు



గొట్టిపల్లి వద్ద రోడ్డు మధ్యలో కంచె

తగరపువలస: ఆనందపురం మండలం బోని పంచాయతీలోని గోస్తనీ వాటర్ వర్క్స్ ద్వారా తాగునీటిని జీవీఎంసీ పరిధిలోని నగర ప్రజలకు తరలిస్తుంటారు. ఏడాది క్రితం ఈ పైపులైన్ గొట్టిపల్లి పంచాయతీ పరిధిలో పగిలిపోయింది. దీంతో వాటర్ వర్క్స్ సిబ్బంది ఇటీవల మరమ్మతులు చేసి మట్టిపోసి చుట్టూ కంచె వేశారు. ఆగష్టు, సెప్టెంబరు నెలలో వర్షాలకు మట్టిలో నుంచి మొక్క లు పుట్టుకువచ్చాయి. మొక్కలకు రక్షణగా కొందరు రోడ్డు మధ్యలో కంచెకట్టారు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ ప్రదేశంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. జీవీఎంసీ అధికారులు రోడ్డుకు పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టాలని ఆనందపురం మండల ప్రజలు కోరుతున్నారు.

మురుగుతో ఇబ్బందులు



పాత మూలకుద్దులో డ్రైనేజీలో వ్యర్థాలు

తగరపువలస: భీమిలి మండలం మూలకుద్దు పంచాయతీలో అపారిశుద్ధ్య వాతావరణంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరకుపల్లి నుంచి అన్నవరం వరకు ఉన్న ఈ రహదారిని ఆనుకుని రోడ్లు, డ్రైనేజీలు దుర్వాసన వెదజల్లుతోంది. శిథిలమైన డ్రైనేజీలలో మురుగునీరు ప్రవహించే అవకాశం లేకుండా ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. రహదారికి ఇరువైపులా ఉప్పునీటి వంతెన వరకు తుప్పలు తొలగించాలని పాత మూలకుద్దు వాసులు కోరుతున్నారు.